

# వేడుక

మట్టిముద్దలు పిసుకుతూ ఆ వృద్ధుడు అలా చాలాసేపటినుంచీ అక్కడకూచుని వున్నారు. ఎండ వేడెక్కుతోంది. నూతి చప్టా వెనుక, జామచెట్టుకింద కూచుని, చేతులనిండా మట్టిముద్దలతో అతను – మట్టితో ఆడుకునే అమాయకపు పసివాడిలా వున్నారు. ఏడుపదులు పైబడిన వయసులో అతను పడే అవస్థచూస్తే ఎవరికయినా ఆశ్చర్యం కలుగకమానదు.

పీక్కుపోయిన చప్పిదవడలు, బట్టతల, సన్నగా పొడుగ్గా వున్నారాయన. జీవితంలో ఎగుడు దిగుళ్ళకీ, అనుభవాలకీ ప్రతీకల్లాగ నుదుటిమీది ముడతలు. చెమట బిందువులు చుక్కచుక్కలుగా తలమీద నుంచి నుదుటిమీదకి, చెవుల ప్రక్కల నుంచి మెడమీదకీ కారుతున్నాయి. ఎండిపోయిన పెదవులకి చెమటనీరు ఉప్పగా తగుల్తోంది. మన్ను పిసుకుతూనే, బెంగబెంగగా వీధి తలుపులకేసి చెవులు రిక్కించి వున్నారతను. ఏ క్షణంలో నయినా ఎవరేనా వచ్చి తలుపులు తట్టవచ్చును. అందుకే తొందరతొందరగా తనపనిముగించాలని ఆత్రుత అతనిలో పెరిగిపోతోంది. అలసటవల్లా, భయంవల్లా బలహీనమయిన అతని చేతివ్రేళ్ళు సన్నగా వణుకుతున్నాయి. వ్రేళ్ళ సందుల్లో తడి మన్ను తపతపమని శబ్దం చేస్తోంది.

ఆ మట్టితో గుర్రం బొమ్మ చేయాలని అతని తాపత్రయం. శరీరంలో అణువణువులోని శక్తినీ కూడదీసుకుని, చేస్తున్న పనిమీద ఏకాగ్ర చిత్తంతో దృష్టి నిలిపివున్నారాయిన.

క్రమక్రమంగా అతని మనోభావాలు ఒక రూపుదాలుస్తున్నట్టుగా – గుర్రం బొమ్మ తయారుకాసాగింది. అతని మనసు అనిర్వచనీయమయిన ఆనందంతో నిండిపోతోంది. అది హృదయ సంబంధి.

అప్పుడతను మహాకావ్య రచన చేస్తున్న అక్షర శిల్పిలా వున్నారు. రసానందంతో అతని హృదయం భారమైంది. అప్పుడే పుట్టినబిడ్డని పొత్తిళ్ళలో గుండెకి చేరువగా, సుతారంగా అదుముకుని దివ్యానుభూతితో పరవశించిపోయే కన్నతల్లిలా అతని కళ్ళు ఆర్ద్రంగా చెమ్మగిల్లాయి.

అంతలో వీధితలుపుల నెవరో దబదబ బాదసాగేరు.

తపోభంగం చెందిన మునిలా కలత చెందిన హృదయంతో లేచి నిలబడ్డారాయన.

* * *

అతని గుండె వేగంగా స్పదించింది. కోడలూ, పిల్లలూ సినిమా నుంచి అప్పుడే వచ్చేశారా! భయంతో అతనికి వొంటిమీద చెమటలు ధారాపాతంగా కారిపోతున్నాయి. ఒక్కక్షణంసేపు అతనికేం చేయాలో తోచలేదు.

తలుపులు కొడుతున్న చప్పుడు విన్పిస్తూనే వుంది.

అతను చప్పున పూర్తి రూపం సంతరించుకోబోతున్న ఆ గుర్రం బొమ్మని నూతి వెనుక చెట్లచెంత దాచేసారు. చేతులు గబగబ చెంబుడు నీళ్ళతో కడుక్కున్నారు. ఆ తొందరలో చేతుల కంటిన మట్టి మరకలు యింకా పూర్తిగా వదలనేలేదు. మట్టి పిసుకుతున్నప్పుడు పంచెమీద మరకలయ్యాయి. ఈ అవతారంతో తననిచూస్తే కోడలు శివాలెత్తిపోతుంది. ఇష్టం అపూలేకుండా నోటికొచ్చినట్టు తిడుతుంది. పిల్లలు తనవేపో జంతువుని చూసినట్టు చూస్తారు. అతనికి తనమీద తనకే అస్యహ్యంవేస్తోంది. దుఃఖం గొంతుదగ్గర గరగరలాడుతోంది.

చేతులు పంచెకి తుడుచుకుంటూ వెళ్ళి భయంభయంగా తలుపులు తీసారు

ఎదురుగా పక్కింటి కుర్రాడు. పేపరుకోసం వచ్చేడు. అతనికి గుండె భారం అంతా ఒక్కసారిగా దిగిపోయినట్లయింది బాధ నెవరో అవలీలగా చేతోత్తీసేసినట్టయింది.

ఆ అబ్బాయికి పేపరు యిచ్చి పంపేశాక, వీధితలుపులు మళ్ళావేసి పెరట్లోకి దారితీశారు. చెట్లచాటున దాచిన బొమ్మని తీసిచూసేరు. గాభరాగా దాచడంవల్ల బొమ్మ రూపం కొద్దిగా చెడింది. దాన్ని మళ్ళీ సరిచేసి శ్రద్ధగా తుదిమెరుగులు దిద్దసాగేరు.

మరికాస్సేపటికి గుర్రం బొమ్మ తయారైంది. ఆనందంతో అతని కళ్ళు అరమోడ్పులయ్యాయి. దానివేపు తృప్తిగా చూసుకుని, ఎవరి కంటా పడనిచోట దానిని భద్రపరిచేరు. చేతులకూ, పంచెకీ అంటిన మట్టి మరకలని శుభ్రంగా కడుక్కుని తన గదిలోకి దారితీసేరు.

* * *

కుక్కి మంచం మీద నడుం వాల్చి తను తయారు చేసిన గుర్రం బొమ్మ గురించే ఆలోచిస్తూ కళ్ళు మూసుకుని పడుకున్నారతను. చింకి బొంతల మీద పరచి ఉన్న పల్చని దుప్పటి మాసిపోయి అదో రకం వెగటు వాసన వేస్తోంది. తలగడకి గలేబు లేదు. జిడ్డుతో అట్టగట్టి వుంది. కదిలినప్పుడల్లా మంచం కిర్రుమంటోంది. మంచం ప్రక్కనే విరిగి పడిపోయేలా వుండే బల్లమీద అతను వాడాల్సిన మందులున్నాయి. ఎప్పుడో పదిహేను రోజుల

## పంతుల జోగారావు

క్రిందట కొడుకు కొని తెచ్చిన మందులవి. వాటిని కూడా పొదుపుగా వాడుకోవలసిందే తను–

మందులయిపోయే యన్న సంగతి కొడుక్కి గుర్తు చేయబోతే కోడలు కస్సున లేస్తుంది. "అప్పుడే అయిపోయే యీ మందులు? ఎంత డబ్బూ మందులకే చాలడంలేదు. ముసలాయన మందులకే డబ్బంతా పోస్తూ వుంటే యిక సంసారం చేసినట్టే–" అని రుస రుసలాడుతుంది.

ఆ మాటలు వింటూ వుంటే ముసిలాయనకి ప్రాణం ఆర్పుకు పోతున్నట్టవుతుంది. మరింక మందుల వూసెత్తడానికి ధైర్యం చాలదు. కోడలన్నదీ నిజమేననిపిస్తుంది. పోయే కాలమే కాని వచ్చే కాలం కాదు కదా తనకి– ఎన్ని మందులు వాడినా తన పరిస్థితి అలాగే వుంది. మరి.

తన రోగం మందుల వల్ల తగ్గేది కాదు; ఆ సంగతి తనకి తెలుసు.

ఈ ఇంట్లో తనేమీ కాదు.– తన ఉనికి అందరికీ భారమే– ఆ సంగతి తెలిసిపోవడానికి అట్టే కాలం పట్టనవసరం లేకపోయింది.

భార్య పోయేక, కొడుకు కర్మకాండ అంతా ముగిసేక ఆఖరి రోజున అడిగిన మొదటి ప్రశ్న–

"ఇక ముందు ఏం చేయదల్చుకున్నారు నాన్నా?" అని.

ఏం చేస్తాడు తను?

ఏడుపు రాలేదు. జీవం లేని నవ్వు పెదాల మీద కదలాడింది.

"మీరొక్కరూ ఈ పల్లెటూర్లో ఎందుకు నాన్నా, మా దగ్గరే ఉందురుగాని, వచ్చెయ్యండి"– అనలేకపోయేడు అలా స్వతంత్రించి అనే ధైర్యం పెళ్ళయ్యాక వాడికెప్పుడూ లేదు.

కోడలు కలగజేసుకుంటూ అంది– "ఉన్న ఫలాన యీ యిల్లూ అదీ వదిలేసి ఆయన మట్టుకేం వస్తారు? వచ్చినా, ఆయన ఉండేందుకు మన కొంపలో వేరే గది కూడా లేదాయె. అంచేత, కాస్త పెద్ద కొంప దొరికేక నింపాదిగా ఆయన రావచ్చులెండి"

ఆ క్షణాన అనిపించింది– తన కట్టె ఈ యింట నుంచే కాటికి వెళ్ళాలి తప్ప– పుట్టి పెరిగిన గ్రామం వొదల కూడదని.

ఈ ఊరితో తనకెన్నో మధురానుభూతులు పెనవేసుని ఉన్నాయి.

ఇక్కడే పుట్టేడు ఇక్కడే పెరిగాడు. బడిపంతులుగా ఉద్యోగం చేసిందీ, రిటైరయ్యిందీ యిక్కడే. పార్వతితో పెళ్ళి ఇక్కడే జరిగింది. మట్టెల చప్పుడుతో యిల్లంతా కలియదిరుగుతూ పార్వతి తిరిగింది యీ యింట్లోనే. సుదీర్ఘకాలం తనతో కష్టం సుఖం పంచుకొని తన పార్వతి తన చేతుల మీదుగా వెళ్ళిపోయిందీ కూడా యిక్కడ నుంచే.

గతం గుర్తొచ్చి అతని మనసు భారమైంది. వెచ్చటి కన్నీరు చెంపల మీదుగా దిగవారింది.

అతని ప్రమేయం లేకుండానే బాల్య స్మృతులు మళ్ళీ కళ్ళ ముందు కదలాడసాగాయి.

బాల్యం ఎంత సరదాగా గడిచిపోయింది?

. భోగిమంటకి కర్రా కంపా సంపాదించడానికి పడే పాట్లు ఎన్నో!! దసరా వేడుకల్లో బాణాలు పట్టుకుని పప్పుబెల్లాల కోసం యిల్లిల్లూ తిరుగుతూ పాడే పాటలు యిప్పటికీ తనకు గుర్తే.

ఇప్పటి పిల్లల జీవితంలో వేగం హెచ్చయింది. వీళ్ళ సరదాలే వేరు. వీళ్ళ ఆటలూ, పాటలే వేరు. పిల్లల సరదాలని కూడా ఒక్కోసారి పెద్దలే నియంత్రించాల్సి రావటం చూస్తుంటే బాధ కూడా కలుగుతూ ఉంటుంది.

తనకెప్పుడూ మనవళ్ళతోను, మనవరాలితోను తన చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకోవాలని కోరిక బలంగా వుంటుంది. అప్పటి ఆటలు, తమ సరదాలు, అల్లరి పనులు, పండుగ ఆర్భాటాలు, వీటి గూర్చి ఉల్లాసంగా చెప్పాలని మనసు తొందర పెడుతూ వుంటుంది.

కాని, వాళ్ళకంత తీరికేదీ? అథవా ఉన్నప్పటికీ కోడలు సాగనివ్వదు. ఆమె దృష్టిలో తన చిన్ననాటి ముచ్చట్లు చాదస్తపు చేష్టల్లా కనిపిస్తాయి. విసుక్కుంటుంది.

"చాల్లెండి– పనిమాలి చదువులూ, చట్టుబండలూ లేకుండా గాలికీ ధూళికీ తిరిగే వాళ్ళమని చెప్పుకోడానికి సిగ్గు వెయ్యడం లేదూ? వీళ్ళకి ఎంత టైమూ చదువులకే సరిపోవడంలేదు. మీ పల్లె చైతు సరదా ఏకరవు పెట్టి పిల్లల్ని చెడగొట్టకండి–"

నిజమే, ఈ పిల్లలు ఇప్పటి సమాజానికి దర్పణాలుగా పెరగడంలో తప్పులేదు. కాని తన అనుభూతులు అనుభవాలు వాళ్ళతో పంచుకోవాలన్న తపన ఎలా నేరమవుతుందో తనకర్థంకాదు.

తనతో ఎవరూ మాట్లాడరు.

వేళకి ఖీ గ్లాసు మనవడు తన గదిలో బల్లమీద పెట్టి వెళ్ళిపోతాడు. మందు సీసాల మధ్య అది కూడా మందులాగే అనిపిస్తుంది తను. భోజనమూ అంతే– అందరూ తిని వెళ్ళిపోయాక ఎండిపోయిన



మెతుకులు. సయించదు. ఏదో తిన్నానని అనిపించి చెయ్యి కడుక్కోవడం–

అలాంటప్పుడు గుర్తొస్తుంది భార్య!

అలాంటప్పుడు గుర్తొస్తుంది పుట్టి పెరిగిన తన పల్లె!

అప్పుడు గుర్తొస్తుంది హరివిల్లులాంటి బాల్యం.

ఏడుపొస్తుంది. గుండె చిద్రుపలవుతుంది. మనిషి కోసం, మనసు కోసం తపించి పోతాడు తను. చిప్పి దవడల మీద నుంచి కారిన కన్నీరు అట్టగట్టిన తలగడని తడిపేస్తుంది.

ఆ ఊరు వదలి రాకుండా వుండాల్సింది. కాని రాక తప్పలేదు. సంఘ భయం కొద్దీ కొడుకు తనని రప్పించక తప్పలేదు దినం గడవక తనకి రాక తప్పలేదు.

పట్నం వచ్చే ముందు సామాను సర్దుతూ వుంటే మనసంతా ఏదో చెప్పలేని వెలితితో నిండిపోయింది. ప్రతి వస్తువునీ ఆప్యాయంగా తడుముతూ కన్నీరు విడిచారు. కదల్చడానికి వీల్లేని సామాను వాళ్ళకీ, వీళ్ళకీ ఇచ్చేసాడు. కొడుక్కి పనికొస్తాయనుకున్న సామాను మాత్రం సిద్ధం చేసాడు.

అప్పుడు కనిపించిందది–

మాసిపోయిన సామ్రాజ్యాలకి చిహ్నంగా శిథిలమయిన కోట గోడ నిల్చినట్టుగా–

వెలిసిపోయిన వర్షానికి గుర్తుగా కొమ్మ మీదా రెమ్మ మీదా నీటి బొట్టు నిలిచినట్టు–

చిన్నప్పటి ఆటబొమ్మ పెద్దయ్యాక దొరికినట్టు–


అటక మీద నుంచి దించిన కర్రసామాన్ల మధ్య కనిపించింది.

గుడ బండి!

దాని మీద కుండీ గుర్రం.

బల్ల చెక్కకి నాలుగు వేపులా కర్ర చక్రాలు. దానిమీద తాడుతో కట్టి నిల్చోబెట్టిన గుర్రం బొమ్మ!

దాన్ని చూస్తూనే చాలాసేపు అలా




వేడుక

ఉండిపోయేడు తను.

తన రామం దానితో ఆడుకునేవాడు. తమ వేపు గ్రామ ప్రాంతాలలో ఆ పండుగ ఎంత వేడుకగా జరిగేదని! కుండీ అమావాస్య అని దాని పేరు. మహాలయ అమావాస్యనాడు జరిగేదా పండుగ పొద్దున్నే తట్టల్లో కుండీ గుర్రాల్ని పేర్చుకుని వీథి వీథీ తిరిగి అమ్మేవాళ్ళు. అణాకొకటి– కుండీ గుర్రం. పిల్లల సంబరం అంతా యింతా కాదు. కొత్త బట్టలు వేసుకుని అటకల మీద నుంచి ముందు రోజే దింపి ధూళీ అదీ దులిపి సిద్ధం చేసుకున్న గుడబళ్ళ మీద ఆ గుర్రం బొమ్మల్ని కట్టేవాళ్ళు. గుడబండి తాడు చేతబుచ్చుకుని గుడ గుడ శబ్దం చేస్తూ వీథులు చుట్టబెట్టేవాళ్ళు– రామం ఆనందానికి పట్ట పగ్గాలుండేవి కావు!

ఈ బండీ, గుర్రం బొమ్మ తీసుకుని వెళ్ళి చూపిస్తే ఎంత ముచ్చటపడిపోతాడో వీట్ని చూపించి ఆ ముచ్చట్లు చెప్తూ వుంటే రామంతో పాటు పిల్లలు కూడా ఎంత సంబర పడతారో! చిన్నప్పటి సరదాలు నెమరు వేసుకోవడంలో ఎంత తృప్తి వుంటుంది?

ఆ ఆలోచన రాగానే తను తీసికెళ్ళబోయే సామాన్లతో పాటు ఆ గుడబండినీ, గుర్రం బొమ్మనీ కూడా భద్రంగా తీసికెళ్ళాలనే నిశ్చయానికొచ్చే రాయన. గుడబండే దుమ్ము పేరుకుపోయి వుంది. గుర్రం బొమ్మని ప్రేమతో తాకపోతే ఎక్కడికక్కడ ముక్కలు చెక్కలుగా విచ్చిపోయింది. చెవిలో పొడి పొడిగా చివికిపోతూ వ్రేళ్ళ సందులోంచి మన్నురాలిపోయింది. అతని మనసు విలవిలలాడి పోయింది. బాధగా నిట్టూర్చి చేతులు దులుపుకున్నారు. గుడబండిని మాత్రం సామాన్లతో పాటు సర్దేరు.

పట్నంలో కొడుకు యింట్లోకి సామాన్లు చేరవేస్తుండగానే కోడలు ఆ గుడబండిని చూసి ముఖం చిట్లించుకుంది. ఒక అసహ్యకరమయిన వస్తువును దేన్నో చూసినట్టుగా ముఖం వికారంగా మార్చుకుంది.

పిల్లలంతా దానివేపు ఆసక్తిగా చూసేరు.

రామం కూడా దాన్ని చూస్తూనే బాల్య స్మృతులు గుండె అరల్లో పొంగి కాబోలు ఉత్సాహంగా ఒక అడుగు ముందుకు వేయబోయి కోడలి ముఖం చూసి జంకి వెనకడుగు వేసాడు.

తనా బండిని చూపించి ఏదో అనబోయేలోగానే–

"ఈ చెత్తంత మోసుకు రాకపోతే అక్కడే వదిలేసి రాలేకపోయేరా? లంకంత కొంప ఎత్తి పెట్టుకొచ్చినా, ఇంట్లోకి పనికొచ్చే సామాను ఒక్కటీ లేకుండా పోయింది. అంతా మన్నూ మశానం–" అంటూ గొణిగింది.

తన ఉత్సాహమంతా నీరు కారిపోయింది. గుండెనెవరో పిండేసినట్లయింది.

కోడలి ఆగ్రహానికి ఆ గుడబండి ఎప్పుడో నీళ్ళ పొయ్యి కిందకి ఇంధనంగా వెళ్ళిపోవలసిందే. కాని, తనే మమకారం చావక ఆమె కంట పడకుండా దాన్ని జాగ్రత్త చేసాడు.

ఆ తర్వాత మనవరాలు తల్లి లేని సమయం చూసి ఆ బండీ గురించి ఒకటి రెండుసార్లు ఆసక్తిగా అడిగింది.

"తాతయ్యా, అదేమిటో చెప్పవ్?" అని చెప్పలేదు తను. చెప్పాలనీ అనిపించలేదు. చెప్తే ఆ పసి మనసు ఉండబట్టలేక తల్లితో అంటుంది. కోడలు సరాంగణం ఎత్తుతుంది. పసిపిల్ల మనసు ఉగ్గబట్టలేక దానితో ఆడుకుంటానని మారాం చేస్తే తల్లి చేత దెబ్బలు తినాల్సి వస్తుందేమో కూడా. ఆ భయం చేతనే మనవరాలికి జవాబు చెప్పక

ఇటీవల బెంగుళూరులో జరిగిన "మేలు కలయిక" సాంస్కృతిక సమ్మేళనంలో ఆహ్వాన వాక్యాలు పలుకుతున్న అధ్యక్షులు శ్రీ డి. శ్రీనివాసులు.



యిన్నాళ్ళూ దాటవేసేవాడు తను. ఆ పిల్ల వదల్లేదు తనని.

రెండ్రోజుల క్రితం అనాసక్తంగా చూస్తున్న తన దృష్టిలో కేలండరు మీద పండుగల జాబితా పడింది. రెండ్రోజుల్లో వస్తోంది అమావాస్య- మహాలయ అమావాస్య! అది చూస్తూనే తనలో ఎంత శక్తి ఏదో పుంజుకుంది. ఉత్సాహంగా లేచి కూచున్నాడు. మనవరాలిని దగ్గరికి తీసుకుని గుడబండి గురించీ. కుండీ గుర్రం గురించీ. ఆ పండుగ గురించీ వివరంగా చెప్పసాగేడు.

"మా డాడీ కూడా చిన్నప్పుడు కుండీ గుర్రం లాగుతూ ఆడుకునేవారా తాతయ్యా?" అమాయకంగా ప్రశ్నించింది మనుమరాలు. అవునన్నట్టుగా తను తల వూపితే ఆ పిల్ల కళ్ళల్లో ఎంత మెరుపేదో మెరిసింది. క్షణంసేపు. ఇంతలో లోపలి నుంచి కర్కశంగా తల్లి పిలుపు వినిపించడం, ఆ పిల్ల యింటిలోకి జారుకోవడం జరిగింది.

అప్పుడు కలిగింది తనకీ ఆలోచన. రాబోయే కుండీ అమావాస్యనాటికి ఎలాగయినా కుండీగుర్రం బొమ్మ తయారు చేయాలి తను. ఎవరికీ తెలీనివ్వకుండా చెయ్యాలి గుర్రం బొమ్మని గుడబండి మీద దాన్ని కట్టి రెండు రోజుల్లో రాబోయే మహాలయ అమావాస్యనాడు దాన్ని హఠాత్తుగా అందరికీ చూపించి చకితుల్ని చేయాలి. దాన్ని చూస్తూనే పిల్లల సందడి చూడాలి తను. చిన్నప్పటి స్మృతులు మెదలి రామం ముఖంలో వెలిగే మందహాస రేఖ చడాలి తను!

అప్పుడు రామంలో -

తన అదుపాజ్ఞలో పెరిగే రామం కనిపిస్తాడు. ఆ అమాయకపు రామం కనిపిస్తాడు. అపేక్షగా, తనకి సన్నిహితంగా వుండే రామం కనిపిస్తాడు.

ఇప్పటి రామం తనకొద్దు-

తననుంచి మానసికంగా దూరంగా పారిపోయే యీ రామం తనకొద్దు-

తన ఉనికినే గుర్తించనట్టుండే ఈ రామం వద్దు-

గుడబండి త్రిప్పుతూ యిల్లంతా తిరిగే చిన్నప్పటి రామం కావాలి తనకి చిన్నప్పటి ఆ రామం మళ్ళీ దొరుకుతాడా తనకి? కనీసం ఆ రామున్ని- వాడి పిల్లల్లోనయినా చూసుకోగలుగుతాడా తను?

ముసిలాయన ఆలోచనలు అనంతంగా సాగిపోతున్నాయి. ఆ ఆలోచనలకి అడ్డుకట్ట వేస్తూ వీధి తలుపు చప్పుడయింది.

ఈసారి వచ్చింది కోడలే- సినిమా వదిలేసారు కాబోలు-

"సినిమా ఎలా ఉందమ్మా" ఆప్యాయంగానే అడిగారు.

అతనికి సమాధానం చెప్పాల్సిన అవసరమే



రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక ప్రదర్శన ఇచ్చి రాష్ట్రపతి శ్రీ వెంకట్రామన్ మెప్పు పొందిన కుమారి రజిత గోరా.

లేనట్టుగా ఓ చూపు విసిరి చరచరా యింట్లోకి దారి తీసిందామె. పిల్లలు ఆమెను అనుసరించేరు.

అప్పుడతనికి ఎందుకో- పాతబడిపోయి, తన చేతిలో నుగ్గు నుగ్గుగా మన్ను గుండగా రాలిపోయిన కుండీ గుర్రం బొమ్మ గుర్తొచ్చింది.

★ ★ ★ ★ ★

ముసిలాయనకి నిద్ర పట్టడం లేదు. కిటికీలో నుంచి ఈదురు గాలి విసురుగా తగుల్తోంది. వర్షం ముంచుకొచ్చేలా వుంది. రాత్రి పదకొండు దాటుతోంది. లోపల గదిలో లైటు తీసేసి వుంది. అంతా నిద్రపోతున్నారు. తనకే నిద్ర పట్టడం లేదు.

మంచం క్రిందికి దిగి తొంగి చూసేరు. గుడబండి మీద మట్టితో తన స్వహస్తాలతో చేసిన గుర్రం బొమ్మ కనిపించింది.

అతని గుండెలో ఆ రోజు ఉదయం ఎదురయిన చేదు అనుభవం తుమ్మ ముల్లులా గుచ్చుకొటోంది.

ఆ వేళే- మహాలయ అమావాస్య. బండినీ, గుర్రం బొమ్మనీ, అందరికీ చూపించి అనందం పంచుకోవాలని ఎదురు చూసిన రోజు!!

ఉదయాన్నే కాఫీల వేళప్పుడు వంట గదిలోకి వెళ్ళారతను. ఎప్పుడు రాని వ్యక్తి, ఆ వేళప్పుడు అలా రావటంతో కొడుకూ కోడలూ అదోలా చూసేరు.

"కాఫీ యికా కాచలేదు-" పుల్ల విరిచినట్టుగా అంది కోడలు. ముసలాయన ముఖంలోకి రక్తం ఎగజిమ్మినట్టయింది.

ఉత్సాహంతో అదేమంతగా పట్టించుకోదల్చుకో లేదు.

"ఇవాళ మహాలయ అమావాస్యమ్మా- మన గ్రామంలో మీ అత్తగారుండే రోజుల్లో ఈ పండుగ ఎంత సరదాగా చేసుకొనేవాళ్ళం-"


అతని మాటలకు అడ్డొస్తూ మూతి తిప్పుతూ అంది కోడలు- "అహా! అలాగా! ఇప్పుడొచ్చే పండుగలే చెయ్యలేక నా నడుం పీక్కు పోతోంది. ఇంక మీ కాలంనాటి పాత చింతకాయ పండుగలన్నీ జరుపుకోవాలంటే నావల్ల కాదు" అంది కఠినంగా.

దెబ్బతిన్న పక్షిలా విలవిలలాడి పోయేడు తను!

"అది కాదమ్మా, పిండి వంటలూ అవీ చెయ్యమని కాదు నా ఉద్దేశం- మా రామం చిన్నప్పుడు ఈ పండుగనాడు గుడబండి వీధుల్లో త్రిప్పుతూ..." అంటూ ఏదో చెప్పబోయేడు.

లిప్తకాలం రామం కళ్ళు మెరిశాయి. భార్య కంటి ఎరుపులో ఆ మెరుపు మాసిపోయింది.


"మళ్ళీ ఆ ముదనష్టపు బండి వూసు తెచ్చారూ? దాన్నప్పుడే విరిచి పోగులు పెట్టి పొయ్యిలో పెట్టేసాను కాను, పీడా పోయేది- ఛీ- ఛీ- వెధవ లేకి ఆటలూ. పల్లెటూరు సరదాలూను- ఇంత



# ఉద్ధరింపు ఎవరి కోసం?

ఈ కాలం ప్రతి ఒక్కరికి తమ పని తాను చేయడం కూడా ఇతర్లను ఉద్ధరిస్తున్నాం అనే భావనతో చేయడం అలవాటు అయింది. "అలికి అన్నం పెట్టడం ఊరిని ఉద్ధరించినట్లు" అనుకున్నాడట వెనుకటికి ఒక మగడు. ఒక్క భర్తలే కాదు. కొందరు భార్యలు కూడా అంతే. గృహిణిగా భర్తకి, పిల్లలకి శుచిగా శుభ్రంగా వండి పెట్టడం, వారి బట్టలు ఉతకడమో, లేదా ఉతికించడమో, నివసిస్తున్న ఇల్లు శుభ్రంగా అందంగా తీర్చి దిద్దుకోవడం తన కోసం తన భర్త, పిల్లల కోసం చేస్తున్నాం అనుకోకుండా అదేదో తాను వాళ్లని ఉద్ధరిస్తున్నట్లు "నేను కాబట్టి ఈ విధంగా వెట్టి చాకిరి చేస్తున్నాను, ఈ స్థానంలో వేరొకరయితే తెలిసేది మీ పాట్లు" అని మాటి మాటికి భర్తపై విసుర్లు" ఏ అమ్మ నాలాగ వండి వారుస్తోంది. ప్రొద్దునే ఒక గుండిగ దించి మూడు పూట్లు అదే తినండి" అంటున్నారు అందరి తల్లులు అని పిల్లల్ని సాధించి తాము తమ బాధ్యత నిర్వర్తిస్తున్నా మనుకోకుండా. ఏదో ఉద్ధరిస్తున్నాం అనే భావన రోజు రోజుకి పెంచేసుకుంటున్నారు. ఇక్కడ గమనించాల్సింది ఒకటుంది. వాస్తవానికి ఇంతకు ముందు కాలం కన్నా ఇప్పటి వనితలు గృహ కృత్యాల్లో ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. కానీ మాటల వలన అవి కొట్టుకుపోయి ఇల్లు రణగొణ ధ్వనులతో నిండి పోతోంది.

ఇక తల్లి, తండ్రులు అంతే. ముఖ్యంగా మగపిల్లల్ని కన్న తల్లితండ్రులు తమ కొడుకులకు విద్యాబుద్ధులు చెప్పించడం, వారికి జీవితంలో ఒక స్థిరత్వాన్ని కలుగజేయడం తమ బాధ్యత అనుకోకుండా అదేదో వారు కొడుకులను కోడళ్ల కోసమే కన్నట్లు మాట్లాడుతారు. "మేము కాబట్టి నానా గడ్డి కరచి పిల్లలకు చదువులు చెప్పించి, ఒక ఇంటి వాళ్లను చేసాం ఇంకొకరయితే ఏ టింత్ క్లాసుతోనో చదువాపించి పద్దులు రాయడానికి ఏ కొట్లోనో పెట్టేవారు" అని కోడల్ని సాధిస్తారు. తమ కొడుకు ఉన్నతే తమ ఉన్నతి అని అనుకోరు.




పిల్లలు మాత్రం! మేము తక్కువ తిన్నామా! అన్నట్లు వాళ్లు వేల్పికి ఇంత తిని, చదువుకోవడం తల్లితండ్రులను ఉద్ధరిస్తున్నామనే అనుకుంటారు. "నేను కాబట్టి క్లాసు ఫస్టు వస్తున్నాను ఎదురింటి వాడ్ని చూడండి గుండు సున్నాలొస్తున్నాయి" అని ఎల్. కె. జి. చదివే వాడి మదిలో భావన.

ఆఖరికి పని మనుష్యులు. తాము తీసుకున్న డబ్బుకి సరిపడ పని చేస్తున్నామా! లేదా! అని ఆలోచించరు. "నేను కాబట్టి రెండు పూటలా పెందరాళే వచ్చి చేస్తున్నాను. ఆ ఎదురింట్లో చేసే మనిషిని చూడండి. ఆ అమ్మగార్ని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగిస్తోంది" అని మొహం మీదే అడిగేస్తారు.

మనుషుల్లో ఈ భావన పోవాలి. ఎవరైన ఏ పనైనా తన ఆనందం కోసం, భుక్తి కోసం, తన వారి అభివృద్ధి కోసం చేస్తున్నామనుకుంటె సమస్యే ఉండదు. కుటుంబంలో ప్రతి ఒక్కరు రోజు కోసారి ఆత్మవిమర్శ చేసుకొని వాళ్ల, వాళ్ల బాధ్యతల్ని నిర్వహిస్తే ఆ ఇల్లు నందనవనమే అవుతుంది. అందులోని మనుష్యులు దేవతలే అవుతారు. అంతేకానీ ఎవరికి తోచినట్లు వారు విసుర్లు విసురుతూ ఇంటిని నరక ప్రాయం చేసుకోవడం వల్ల ప్రయోజనమేమిటి? పుట్టిన ప్రతి వ్యక్తి అంతో ఇంతో వారి స్థాయికి తగ్గట్లు పని చేయక తప్పదు. ఆ చేసే పనేదో సంతోషంగా, బాధ్యతతో మనసు పెట్టి చేస్తే తమకి ఆరోగ్యం, చుట్టూ ఉన్న వారికి ఆనందం.

—ప్రమీల

## వేడుక

వయసొచ్చినా, "మా కాలంనాడయితే..." అంటూ సన్నాయి నొక్కులు నొక్కడం మానరు- ఏం మనుషులో!" కోడలు దులపరిస్తూ అక్కడినించి వెళ్ళిపోయింది- ఆమె వెనకే రామం, పిల్లలూనూ-

ఉదయం సంఘటన గుర్తొచ్చి, అతని కళ్ళల్లో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. మనసు బాధగా మూలుగుతోంది. అశాంతిగా అటూ యిటూ పత్తిగిల్లేరు. కిర్రు మంచం అతన్ని ఓదార్చలేదు.

★ ★ ★ ★ ★

"డాడీ! తాతగారు కనిపించడం లేదు!"

చదువుకోడానికి తెల్లవారు ఝామున లేచిన రామం పెద్ద కొడుకు ముందు గదిలో కిర్రు మంచం ఖాళీగా వుండడం చూసి గాభరాగా తండ్రిని లేపాడు.

త్రుళ్ళిపడి లేచాడు రామం. అతని భార్య- మిగతా పిల్లలు కూడ లేచి కూర్చున్నారు.

అత తొట్రుపాటుతో ముందు గదిలోకి వెళ్లారు. మంచం ఖాళీగా వుంది. యిల్లూ, పెరడూ అంతా వెతికినా ముసిలాయన జాడ లేదు. రామంలో ఆత్రుత పెరిగిపోసాగింది. పిల్లలు ఏడుపు లంకించుకున్నారు.

"ఈయన ఏ అఘాయిత్యం తల పెట్టలేదు. కదా- వెళ్ళి వెతకండి" అంది రామం భార్య గాభరాగా.

రామం టార్చి లైటు తీసుకుని వీధిలోకి బయిలుదేరాడు. మగ పిల్లలిద్దరూ అనిని అనుసరించారు.

రాత్రంతా విడువకుండా వర్షం పడిందేమో, నేలంతా చిత్తడిగా ఉంది. రొజ్జ గాలి వొంటిని ఝుళ్మనిపిస్తోంది. చీకటి తెరలు విడివడి అప్పుడప్పుడే కొద్ది కొద్దిగా వెల్తురు వస్తోంది.

తండ్రిని వెతుకుతూ వస్తున్న రామం, ఆ వీధి మలుపు తిరుగుతూనే ఆగిపోయేడు. అక్కడ ప్రహరీ గోడనానుకుని కుప్ప కూలి పోయి వున్న ఆకారాన్ని చూచి అతనికి రక్త ప్రసరణం ఆగిపోయినట్లయింది.

టార్చి లైటు వెలుగులో తండ్రిని పోల్చుకుని అతనిలో దుఃఖం పెల్లుకు వచ్చింది. "నాన్నా!" అంటూ అరిచాడు ఆందోళనగా- పిల్లలు గొల్లుమన్నారు.

వర్షంలో, చీకట్లో తండ్రి అసలింత దూరం ఎందుకు వచ్చేరో అతని కర్థం కాలేదు. టార్చి లైటు పెద్ద కొడుకు చేతికిచ్చి నీరు ఒడుతున్న తండ్రి శరీరాన్ని రెండు చేతుల్తో, లేవనెత్తబోయాడు. చలనం లేకుండా బరువెక్కిన తండ్రి దేహం భుజం మీదికి భారంగా చేర్చి పొదివి పట్టుకున్నాడు.

తండ్రిని లేవనెత్తుతూ ఉంటే- తండ్రి కుడి చేతిలో మూసిన గుప్పెట్లో బిగించి పట్టుకున్న తాడు రామం చేతిని చుట్టుకుంది. పెను పామేదో చేతికి చుట్టుకున్నట్లుగా అదిరిపడి విదిలించబోయేడు రామం. తాడుతో పాటు లేస్తూ చప్పుడు చేసింది గుడబండి!

"నాన్నా, అటు చూడు-" పిల్లలు ఆశ్చర్యంతో అరిచేరు.

టార్చి వెలుగులో అటు వైపు ఉద్విగ్నంగా చూసేడు రామం.

యజమాని వెంట తోకాడిస్తూ విశ్వాసంగా తిరిగే కుక్క పిల్లలా ఉంది- తడిసిన గుడబండి.

దాని మీద-

రాత్రంతా ముసలాయనతో నాలుగు వీథులూ ఊరేగి, వర్షానికి తడిసి నానిపోయిన గుర్రం బొమ్మ- ఇప్పుడది పిడికెడు మట్టి ముద్ద!